క్లుప్తంగా

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలోని పంచలింగాల కోన వద్ద వెలసిన శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ 28వ వార్షికోత్సవ పూజలను మాచుపల్లె గ్రామ ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు రంగసముద్రం మల్లికార్జునశర్మ.. స్వామివారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, పుణ్యాహావాచనం, పంచామృతాభిషేకం, మహానివేదన, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాల వినియోగం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాచుపల్లె గ్రామానికి చెందిన బి. గంగావీరుడు, కాకర్ల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ పశుపతినాద ఆలయంలో సోమవారం భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్‌కు చెందిన భగవతారిణి శారద బృందం ఆలపించిన హరికథ, అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కూలిన రేకుల షెడ్డు



పడిపోయిన రేకుల షెడ్డు వద్ద బాధితులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పుటికంవారిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి వీచిన భారీ గాలులకు చిన్నపూలు నరసింహులు అనే వ్యక్తి రేకుల షెడ్డు నేలకొరిగింది. రాత్రి భారీగా గాలులు వీచడంతోపాటు జల్లులు కురిశాయి. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నరసింహులు రేకుల షెడ్డు పడిపోవడంతో నిరాశ్రయుడయ్యాడు. అధికారులు, నాయకులు ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో సీటు



తల్లిదండ్రులతో జయంత్‌రెడ్డి

చిన్నమండెం : మండలంలోని వండాడి గ్రామానికి చెందిన చింతరెడ్డి జయంత్‌రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో సీటు పొందినట్లు ఆయన తల్లిదండ్రులు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, పద్మజ తెలిపారు. వీరి కుటుంబీకులు వండాడి గ్రామంలో వైఎస్ ఆర్‌సీపీ తరఫున పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. పలు వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అటువంటి కుటుంబానికి చెందిన జయంత్‌రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో సీటు రావడం పట్ల వైఎస్ఆర్‌సీపీ వండాడి గ్రామ నాయకులు చింతంరెడ్డి రంగారెడ్డి, సర్పంచ్ ముసలిరెడ్డి, రెడ్డిభూషణ్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డిలతోపాటు పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నివాళి



అంజాద్‌ఆలీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజాద్‌ఆలీ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. దీంతో సోమవారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు.

టమాటా ట్రాక్టర్ బోల్తా

మదనపల్లె రూరల్ : టమాటా ట్రాక్టర్ బోల్తా పడి పంట నేలపాలైన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. కోటవారిపల్లెకు చెందిన రైతు గోవర్ధన్ పొలంలో కోసిన టమాటాలను 230 క్రేట్లలో నింపుకుని ట్రాక్టర్‌లో మదనపల్లె మార్కెట్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలో..పట్టణంలోని కదిరిరోడ్డు వద్ద అకస్మాత్తుగా ట్రాక్టర్ ముందు టైర్ పేలడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో టమాటా పంట నేల పాలైంది.

మురికి కూపం.. దుర్గంధ భరితం

- నిండిపోయిన డ్రైనేజీ కాలువ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఇదీ బస్టాండు రోడ్డు పరి(దు)స్థితి



రోడ్డుపైన ప్రవహిస్తున్న మురుగు నీరు



మురుగునీటి కాలువలో పేరుకుపోయిన చెత్త

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నడిబొడ్డున బస్టాండు రోడ్డు మార్గంలో మురుగు నీటి కాలువ నిండిపోయి రోడ్డు మీద మురుగు పారుతోంది.

డైట్ స్కూల్ పక్కన మెయిన్ రోడ్డులోని కాలువ చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో మురుగునీరంతా రోడ్డుపైకి పారుతోంది. ఈ ప్రాంతంలో నిత్యం వందలాది మంది ప్రజలు, పలు వాహనాలు తిరుగుతుంటాయి. ఇక్కడికి రాగానే వాహనాలు వెళ్లే క్రమంలో ఆ మురుగు నీరంతా అటు వైపు వెళ్లే వారిపైన పడుతుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దాదాపు నెల రోజులుగా ఈ ప్రాంతంలో మురుగు నీరు పొంగి రోడ్డుపైన ప్రవహిస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతం గుండా వెళ్లాలంటే ముక్కున వేలేసుకొని జాగ్రత్తగా నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లా కేంద్రం, అందులోనూ ముఖ్యమైన రోడ్డు మార్గంలో ఇంత ఘోర పరిస్థితి నెలకొనడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన మురుగును తొలగించి నీరు సక్రమంగా వెళ్లేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఆదర్శనీయుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ



రాజంపేట టౌన్ : మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు



రాయచోటి టౌన్ : శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

రాజంపేట టౌన్ : భారతదేశానికి ఒకే రాజ్యాంగం, ఒకే జెండా ఉండాలని పోరాడుతూ బలిదానమైన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆదర్శనీయుడని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.పాపయ్య ఆధ్వర్యంలో సోమవారం బోయినపల్లెలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌నాయుడు పాల్గొని మాట్లాడారు. భారతదేశాన్ని విడగొట్టే 370 జీవోను వ్యతిరేకిస్తూ పోరాటం చేసి ప్రాణాలను వదిలిన గొప్ప నాయకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అన్నారు. ఆయన కన్న కలలను ప్రధాని నరేంద్రమోదీ 370 జీఓను రద్దు చేసి నెరవేర్చారని తెలిపారు. భారతదేశ సమగ్రతకు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మొక్కలను నాటారు. తొలుత శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పట్టు పోగుల ఆదినారాయణ, పెనుగొండ రమణ, భోగ రాజ, పాపయ్య, పురుషోత్తం, బీమిశెట్టి వెంకటయ్య, గోపాల్, నూకల శ్రీనివాసులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అఖండత్వం కోసం బలిదానం

రాయచోటి టౌన్ : ఖండిత భారత దేశ అఖండత్వం కోసం బలిదానం అయిన దేశభక్తుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ పాలగిరి శ్రీనివాస రాజు అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఉన్న బీజేపీ కార్యాలయంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి అసెంబ్లీ కో- కన్వీనర్ నిర్మల్ కుమార్, బీజేపీ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద గజపతి రాజు, ఓబీసీ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు రేపన శివప్రసాద్, బీజేపీ నాయకులు మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



యువత పోరుకు వెళ్తున్న ఒంటిమిట్ట యువకులు

ఒంటిమిట్ట : రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువత పోరు కార్యక్రమాన్ని సోమవారం చేపట్టింది. ఈ సందర్భంగా మండల కేంద్రమైన ఒంటిమిట్టలో యువజన విభాగం ఆధ్వర్యంలో రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ అధ్యక్షులు కూండ్ల ఓబుల్ రెడ్డి అధ్యక్షతన మండలంలోని యువకులను పెద్ద ఎత్తున సమకూర్చి అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఎదుట నిరసన తెలిపేందుకు బయలు దేరారు. ఈ సందర్భంగా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రకారం యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ మండల అధ్యక్షుడు మేరువ శివనారాయణ, ఒంటిమిట్ట మండల ప్రచార విభాగం అధ్యక్షులు రాజశేఖర్ రాయల్, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని చంద్రబాబు

నందలూరు : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విఫలం చెందారని మండల వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఆరోపించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం ఆధ్వర్యంలో ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షులు గీతాల నరసింహారెడ్డి, వలంటీర్స్ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు భాస్కర్‌యాదవ్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గుణయాదవ, యూత్ లీడర్ ఆనాల మధుయాదవ్, ఆడపూరు రవిరాజు, అఖిల్, భరత్, వివిధ విభాగాల కన్వీనర్లు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి పట్టని పాలకులు

- సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి
- సీపీఐ జిల్లా నేతలు



సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

రాజంపేట : కేవలం ఓట్లు, సీట్లు తప్ప.. జిల్లా అభివృద్ధి పాలకులకు పట్టడం లేదంటూ రాజంపేట సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నేతలు పి.మహేష్, తుమ్మల రాధాకృష్ణ మాట్లాడుతూ ఆరు నియోజకవర్గాల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఉపాధి అవకాశాలు లేక చదువుకున్న విద్యార్థులు విదేశాలలో వెట్టిచాకిరి కోసం స్వదేశాన్ని విడిచివెళుతున్నారన్నారు. మరి కొంత మంది చెడుమార్గంలో వెళుతున్నారన్నారు. జిల్లా సహజవనరులు, హార్టికల్చరల్, విహార ప్రదేశాలు చాలా ఉన్నప్పటికీ అభివృద్ధికి మాత్రం దూరంలో ఉందన్నారు. నందలూరు రైల్వే పరిశ్రమ, ఆల్విన్ పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. పాలపరిశ్రమలు కనుమరుగైయ్యాయన్నారు. అప్పాజూస్ ఫ్యాక్టరీ, సీటీఎం స్పిన్నింగ్‌మిల్, పీలేరు నూనెవిత్తనల కర్మాగారంతోపాటు అనేక ఉపాధి కల్పించే పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. మంగంపేట బైరెటీస్ కొంత మందికి ఆదాయ వనరుగా మారిందన్నారు. ఎర్రచందనం, మట్టి, ఇసుకను కొల్లగొడుతున్నారన్నారు. సహజవనరులను భవిష్యత్తు తరాలకు కనిపించకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు, ఝురికోన, అన్నమయ్య ప్రాజెక్టు పురోగతి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కృష్ణపట్నం రైలుమార్గంలో ఇంతవరకు ప్రజలకు అందుబాటులో రైలును వేయించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కడప-బెంగళూరు రైలు మార్గంను వెంటనే పూర్తి చేయాలన్నారు. కడప-రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణంను చేపట్టాలన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారిలో నిత్యం వందలాది ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనేక మంది మృత్యువాతకు గురవుతున్నారన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతిచిన్నయ్య, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సీజె చెన్నయ్య, రాజంపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి పూలభాస్కర్, కోడూరు ఇన్‌చార్జి గోశాల దేవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, సహాయ కార్యదర్శి మురళీ, ఏఐవైఎఫ్ సికిందర్, రాజశేఖర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరోజనమ్మ, బీకేఎం ఉపాధ్యక్షుడు జయరాం, సీపీఐ మండల కార్యదర్శులు నాగమ్మ, ఆదినారాయణ, సెల్వకుమార్, పార్టీ ప్రజా సంఘాల నేతలు పరమయ్యగారి సుబ్రమణ్యం, రమణ, పెంచలయ్య, జమాల్‌బాష, సాయి, వెంకటేశ్, బాబాజాన్, లక్ష్మీనారాయణ, శివయ్య, రాజశేఖర్, వెంకటరమణ, రోజమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో నీళ్లు, లైట్లు సేవలు నిలిపివేత

మదనపల్లె: పట్టణంలో 20 రోజులుగా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సోమవారం ప్రజలు అందిస్తున్న సేవలను నిలిపివేశారు. విధులు బహిష్కరించిన కార్మికులు పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహరణ ఆగిపోయింది. సేవలకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు విధులను బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లకు సత్వరమే ఆమోదం తెలపాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరాహార దీక్షలు చేస్తున్నా, విధులను బహిష్కరించినా ప్రభుత్వానికి సంబంధం లేనట్టు వ్యవహరిస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన అనంతరం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, నాగరాజు, బాబు, బాలకృష్ణ, సజాద్, కుమార్ పాల్గొన్నారు.

నేడు మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష

లక్కిరెడ్డిపల్లి : ఏపీ మోడల్ స్కూల్‌లో 6,7,8,9వ తరగతులలో మిగిలిన సీట్లకు మంగళవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. మిగిలిన సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉదయం 9 గంటలకు ఏపీ మోడల్ స్కూల్‌లో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. పరీక్ష అనంతరం మార్కులు మెరిట్ ప్రకారం ఆయా తరగతుల్లో చేర్చుకుంటారని తెలిపారు. కావున దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పరీక్షకు హాజరు కావాలన్నారు.

మద్దతు ధరకే కొనుగోలు చేయాలి

సుండుపల్లె : తోతాపురి మామిడికాయలను మద్దతు ధరకే కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సుండుపల్లెలో మాట్లాడారు. తోతాపురి మామిడి కాయలు రైతుల పాలిట శాపంగా కాకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను కాపాడాలని కోరారు. మామిడి గుజ్జు పరిశ్రమలు తోతాపురి మామిడి కాయలకు కిలో రూ.8, ప్రభుత్వం వంతు ప్రోత్సాహక మొత్తం రూ.4లు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

30 మందికి ఒకే ఉపాధ్యాయుడు

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బెస్తపల్లిలోని ఉర్దూ పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఒక్కడే ఉపాధ్యాయుడు, అది డిప్యూటేషన్ మీద ఉన్నాడని ఉర్దూ స్కూల్ కమిటీ చైర్మన్ జక్రియా బాషా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దకాలం నాటి పేరున్న ఈ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న స్కూలుకు ఒక్కడే ఉపాధ్యాయుడు ఉండటం, అందులోనూ డిప్యూటేషన్ టీచర్ ఉండటం దురదృష్టకరమని తెలిపారు. బెస్తపల్లి జనాభాలో ఎక్కువ శాతం మంది ముస్లింలు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వారు ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు జానీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి దాతృత్వం

పెనగలూరు : చక్రంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి బొల్లా శ్రీనివాసులు నాబార్డులో ప్రస్తుతం అదనపు జనరల్ మేనేజర్‌గా పని చేయుచున్నాడు. పది వేల రూపాయలను పాఠశాల అభివృద్ధి కోసం ఆయన మిత్రుడు స్కూల్ అసిస్టెంట్ రామచంద్రయ్య ద్వారా ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాలకృష్ణకు అందజేయడం జరిగింది. పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయవచ్చని వారు పేర్కొన్నారు. ఈ నగదుతో స్టేజికి పెయింటింగ్ నిర్మాణాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

సిద్దవటం : కడప నగరం మా ఐ కేర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో మంగళవారం సిద్దవటంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగునని ఆసుపత్రి మేనేజర్ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం దిగువపేటలోని శ్రీ కోదండరామస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం ఉచిత కంటి వైద్య శిబిరం జరుగునన్నారు. లేజర్ సర్జరీ స్పెషలిస్టు కంటివైద్యులు డాక్టర్ ఎం.దినేష్ హాజరై వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కావున సిద్దవటం గ్రామం, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

26న ఉపాధి పనులపై బహిరంగ సభ

రాజంపేట టౌన్ : ఈ నెల 26వ తేదీ ఉదయం పది గంటల నుంచి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పగడాల వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందం ఈనెల 1వ తేదీ నుంచి తనిఖీ చేస్తుందన్నారు. తనిఖీలో కనుగొన్న విషయాలపై బహిరంగ సభలో చర్చించనున్నట్లు తెలిపారు. సభలో ప్రజా ప్రతినిధులు, రైతులు, ఉపాధి కూలీలు, సిబ్బంది, ఉపాధి హామీ అనుసంధాన శాఖల సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటాం

- రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథరెడ్డి



సుదర్శన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి

పుల్లంపేట : అధికారం చేపట్టి ఏడాది దాటినప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి యువత పోరు ద్వారా కనువిప్పు కల్గించాలని రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథరెడ్డి అన్నారు. సోమవారం పుల్లంపేటలోని మాజీ సింగల్ విండో ప్రెసిడెంటు సుదర్శన్ రెడ్డిని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూటమి పార్టీలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని కొంత మందికి అందించలేదన్నారు. అలాగే యువతను నట్టేట ముంచారన్నారు. నిరుద్యోగ భృతి కూడా చెల్లించలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించలేదని, హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముస్తాక్, రామనాథం, ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, బికె మణి, కుమార్‌రెడ్డి, రిజ్వాన్, ఆలం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేజ్ సర్వేయర్లు

ఓబులవారిపల్లె : సమస్యలు పరిష్కరించాలని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యామినీరెడ్డికి విలేజ్ సర్వేయర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుంచి పని చేస్తున్నా ప్లే సర్వేయర్లకు జీతాలు పెంచలేదని పేర్కొన్నారు. రీ సర్వే పనుల్లో తమకు ఎటువంటి అదనపు పరికరాలు ఇవ్వకుండా బదిలీల ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు శాంతియుతంగా నిరసన చేపడతామని వారు స్పష్టం చేశారు. ఇందుకు తహసీల్దార్ మాట్లాడుతూ విలేజ్ సర్వేయర్ల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు తేజ, జనార్దన్, మధుసూదన్‌రెడ్డి, నారాయణ, ప్రీతి గురి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకోండి

పెనగలూరు : ప్రభుత్వ కాలనీల్లో ఇంటి పట్టాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ అమరేశ్వరీ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆమె సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో పక్కా గృహాలు, ఇంటి స్థలాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే గ్రీవెన్స్ నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు వీఆర్‌ఓలు కృషి చేయాలన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించే విధంగా ప్రయత్నం చేయాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఇతరుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు చేసుకుంటే ఆలస్యం లేకుండా పరిశీలించి మంజూరు చేయాలని తెలియజేశారు. అనంతరం వివిధ సమస్యలపై రెవెన్యూ సిబ్బందితో ఆమె చర్చించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం హైస్కూల్ పరిశీలన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధి పార్వతీపురంలో ఉన్న ఎస్వీబీవీడీ సభా హైస్కూల్‌ను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని గదులను పరిశీలించారు. విద్యార్థిని, విద్యార్థులను పలకరించి తల్లికి వందనం వచ్చిందా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న కొత్త విధ్యావిధానాలను పథకాలను ఉపయోగించుకొని చక్కగా విద్యను అభ్యసించి అందరూ ప్రయోజకులు కావాలని తెలిపారు. పిల్లల ఉత్సవాన్ని, సామర్థ్యాలను, క్రమశిక్షణను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంటు ఎం.డి. మధు, అధ్యక్షుడు ఎం.డి.ప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, కొందరు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి



కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట : పట్టణంలో భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి రాజంపేట మున్సిపాలిటీ కమిషనరు శ్రీనివాసులు అన్నారు. సోమవారం తన చాంబరులో ఆయన మాట్లాడుతూ అనమతుల కోసం లైసెన్సుడే టెక్నికల్ పర్సస్ ద్వారా రూల్స్ మేరకు కట్టి సమర్పించుకోవాలన్నారు. అప్పుడే అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిర్ణీత గడువులోగా ఆర్జీపై తప్పకుండా ఏపీ బిల్డింగ్ రూల్స్ 2017 అనుసరించి పరిశీలించడం జరుగుతుందన్నారు. మధ్యవర్తులు డబ్బులు అడిగా, హామీలతో మోసపోరాదన్నారు. అనుమతులు లేకుండా ఇళ్ల అక్రమ నిర్మాణాలు, అనధికారిక లేఔట్లలో ప్లాట్ కొనడంగానీ, నిర్మాణం గానీ చేయరాదన్నారు. ఆ విధంగా చేపట్టిన నిర్మాణాలకు మున్సిపల్ చట్టం 1965 ప్రకారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలందరికీ తెలియచేస్తున్నామన్నారు. అనధికారికంగా లేఔట్స్, అమ్మకాలు చేయుచున్న స్థల యజమానులు, డెవలపర్ల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



జాఫర్‌వలి



యశ్విత

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థి షేక్ జాఫర్‌వలి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ దిలీప్ సోమవారం తెలిపారు. ఈ విద్యార్థి మండలంలో మొదటి స్థానాన్ని సాధించినట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

కేజీబీవీ విద్యార్థిని

చిన్నమండెం : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలకు చెందిన బి.యశ్విత ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఇటీవలే పదో తరగతి పరీక్షలలో యశ్విత అత్యుత్తమ మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ట్రిపుల్ ఐటీలో యశ్విత సీటు సాధించింది. యశ్వితను ఉపాధ్యాయులు అభినందించారు.

వైఎస్ఆర్‌సీపీ బలోపేతం కోసం కృషి



సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన ఎం.శంకర్‌రెడ్డి

పుల్లంపేట : వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆ పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆయనను ఆదివారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో అన్నమయ్య జిల్లాకు చెందిన నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారికి సజ్జల పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లాకు చెందిన స్టేట్ సెక్రటరీ గాలివీటి వీరనాగిరెడ్డి, జనరల్ సెక్రటరీ గాలివీటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సెక్రటరీ మధు, రైల్వేకోడూరు అసెంబ్లీ పంచాయతీరాజ్ ప్రెసిడెంట్ మూరి శివశంకర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

300 లీటర్ల సారా ఊట ధ్వంసం

- నల్లబెల్లం విక్రయించిన వ్యాపారి, సారా విక్రేత అరెస్ట్

మదనపల్లె రూరల్ : నిమ్మనపల్లె మండలం గారబురుజు అటవీప్రాంతంలో మదనపల్లె ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది జరిపిన దాడుల్లో 300 లీటర్ల సారా ఊట ధ్వంసం చేయడంతో పాటు 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...గారబురుజుకు చెందిన పి.వెంకటరమణ, అటవీప్రాంతంలో సారా బట్టీ నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి, సారా తయారీకి నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటతో పాటు 10 లీటర్ల సారాను గుర్తించామన్నారు. వెంకటరమణను అరెస్ట్‌చేసి, నాటుసారా తయారీకి ముడిసరుకుల సరఫరా గురించి విచారిస్తే..మదనపల్లె టౌన్, చిత్తూరుబస్టాండ్‌లోని మహేష్ జనరల్ స్టోర్స్ నుంచి నల్లబెల్లం కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో అతడి వాంగ్మూలం ఆధారంగా మహేష్ జనరల్ స్టోర్స్‌లో సోదాలు నిర్వహించి, 15 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకోవడంతో పాటు రాంగోపాల్‌నాయుడు వీధికి చెందిన దుకాణ యజమాని వి.సత్యనారాయణ కుమారుడు వి.మహేష్‌ను అరెస్ట్ చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు వీరనాగయ్య, మధుసూధన్, కానిస్టేబుళ్లు నాగరాజు, మధు, రేఖ తదితరులు పాల్గొన్నారు.